సాక్షి కామారెడ్డి
శనివారం | 30 | నవంబర్ | 2024



మంచం పట్టిన సోమారం
తాడ్వాయి మండలంలోని సోమారం గ్రామస్తులు పక్షం రోజులుగా జ్వరాలు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు.
- 9లో ▸



ఆర్థికంగా ఎదగాలి
మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
32.4 /9.7

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగే అవకాశాలున్నాయి.

ముందస్తు అడ్మిషన్లు!

- కార్పొరేట్ కళాశాలల మాయాజాలం
- ఏజెంట్ల ద్వారా పేరెంట్స్‌కు గాలం
- సీటు దొరుకుతుందో లేదోనని ముందుగానే బుక్ చేసుకుంటున్న తల్లిదండ్రులు
- పట్టించుకోని ఇంటర్ అధికారులు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పదో తరగతి పరీక్షల షెడ్యూల్ కూడా రాకముందే కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించాయి. విద్యార్థుల అడ్రస్‌లు సేకరించిన యాజమాన్యాలు.. ఏజెంట్లను రంగంలోకి దింపాయి. వారు విద్యార్థుల ఇళ్లకు చేరుకుని ఫలానా కళాశాలలో చేర్పిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని తల్లిదండ్రులను నమ్మిస్తున్నారు. ఇప్పటికే చాలామందినుంచి అడ్వాన్సులు కట్టించుకుంటున్నారు. కార్పొరేట్ కాలేజీలకు సంబంధించి ఒక్కో బ్రాంచ్‌లో ఒక్కో ధర ఉంటుంది. ఇంజినీరింగ్, మెడిసిన్ కోసం ప్రిపేర్ చేయడానికి అందులోనూ రకరకాల పేర్లతో బ్యాచ్‌లను తయారు చేసి బోధిస్తారు. ఫలానా బ్రాంచ్‌లో చదివిస్తే ఎంపీసీ పిల్లలకు జేఈఈ పక్కా వస్తుందని, ఫలానా బ్రాంచ్‌లో చదివిస్తే మెడిసిన్ సీట్ వచ్చి తీరుతుందని నమ్మిస్తూ ఏటా అడ్మిషన్లు బుక్ చేస్తున్నారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఇప్పటికే చాలామంది విద్యార్థులు కార్పొరేట్ కాలేజీల్లో అడ్వాన్సులు చెల్లించి దస్తీ వేసుకున్నారు. తల్లిదండ్రుల ఆశలను ఆయా కాలేజీల యాజమాన్యాలు వ్యాపారంగా మార్చుకుని ఏడాదికేడాది ఫీజులు దండిగా పెంచేస్తున్నాయి. మెడిసిన్, ఇంజినీరింగ్‌లలో మంచి ర్యాంకులు సాధించాలంటే మంచి కాలేజీని ఎంచుకోవాలని చెబుతూ ఏడాదికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల దాకా వసూలు చేస్తున్నారు. చాలా మంది మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలు తమ పిల్లలకు మంచి చదువు కోసమంటూ అప్పులు చేసి మరీ ఆయా కళాశాలల్లో చేర్పిస్తున్నారు.

ఒత్తిడి తట్టుకోలేక..

పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే కార్పొరేట్ చదువులు ఒక్కటే దారి అన్న భావన తల్లిదండ్రుల్లో పెరిగిపోయింది. దీంతో పిల్లల మానసిక స్థితి, వారి ఆసక్తిని గమనించకుండానే మంచి మార్కులు, ర్యాంకుల కోసమంటూ తమ పిల్లలను కార్పొరేట్ కాలేజీల్లో చేర్పించేస్తున్నారు. అయితే కొందరు పిల్లలు ఇష్టంలేకున్నా కన్నవారి మాట కాదనలేక ఆయా కళాశాలల్లో చేరుతున్నారు. అయితే ఇటీవలి కాలంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. పిట్టగూడులాంటి అపార్టుమెంట్లలో కొనసాగుతున్న కార్పొరేట్ కాలేజీల్లో విద్యార్థులను కనీసం సూర్య కిరణాలు కూడా దరిచేరడం లేదు. క్లాస్ రూం, డైనింగ్ హాల్, హాస్టల్ తప్ప మరో లోకం తెలియడం లేదు. నిరంతరం చదవడం మూలంగా చాలామంది తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారు. దానికితోడు అక్కడ అందించే భోజనం రుచించక చాలా మంది ఇబ్బందిపడుతున్నారు. గతేడాది మాచారెడ్డి మండలానికి చెందిన ఓ విద్యార్థి హైదరాబాద్‌లోని కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్‌లో చేరింది. ఒత్తిడి తట్టుకోలేక హాస్టల్‌లో చేరిన వారం రోజులకే ఆత్మహత్య చేసుకుంది. ఆమెతో కలిసి ఆ కాలేజీలో చదివిన పలువురు పిల్లలు షాక్ గురై, ఆ కళాశాలలో చదవలేమంటూ వెనక్కి వచ్చారు. ఇటీవల కామారెడ్డికి చెందిన ఓ ఇంటర్ విద్యార్థి ఒత్తిడితో కాలేజీ హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కొడుకు చదివి ప్రయోజకుడవుతాడని కలలుగన్న తల్లిదండ్రులకు తీరని శోకం మిగిలింది.

ఒత్తిడి లేని చదువులు కావాలి



తల్లిదండ్రులు రూ.లక్షల్లో కాలేజీ ఫీజులు కట్టి తమ పిల్లలను తామే పేషెంట్లుగా తయారు చేస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి మార్కులకోసం ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో చేర్పిస్తున్నారు. మార్కులు, ర్యాంకుల కోసం యాజమాన్యాలు పిల్లలపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులు మానసికంగా దెబ్బ తింటున్నారు. మార్కుల కోసమో, గొప్పతనం కోసమో పిల్లల భవిష్యత్తును నాశనం చేయొద్దు. చిన్నప్పటి నుంచి పిల్లలకు గోల్ సెట్ చేయాలి. లేదా వాళ్ల ఆసక్తిని గమనించాలి. ఎలాంటి ఒత్తిడులు పెట్టకుండా ప్రోత్సహిస్తే వారు చక్కగా చదవగలుగుతారు. అలాంటి వాతావరణంలోనే పిల్లలు సక్సెస్ కాగలరు.

– తిరునగరి శ్రీహరి, మోటివేటర్, కామారెడ్డి

పిల్లల ఇష్టాయిష్టాలను గుర్తించాలి



పిల్లల ఇష్టాయిష్టాలను పక్కన పెట్టి తల్లిదండ్రులు తాము ఎంచుకున్న దారిలో నడవాలనే పట్టుదలకు పోతున్నారు. అందులో భాగంగానే కార్పొరేట్ కాలేజీలకు పంపుతున్నారు. అక్కడ సరైన సౌకర్యాలు ఉండడం లేదు. సరైన భోజనం లభించడం లేదు. పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకునే దాకా పుస్తకాలతోనే గడపాల్సిన పరిస్థితి. ఆపై పరీక్షల్లో సరైన మార్కులు రావడం లేదంటూ అందరి ముందూ చులకనగా మాట్లాడతారు. దీంతో విద్యార్థులు మానసికంగా నలిగిపోతున్నారు. పిల్లల మానసిక స్థితిని అర్థం చేసుకుని అందుకు తగ్గట్టుగా వ్యవహరించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైన, అధ్యాపకులపైన ఉంది.

– జి.రమణ, సైకియాట్రిస్ట్, కామారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వేదికపై ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, లక్ష్మీకాంతారావు

సన్నవడ్ల సాగును ప్రోత్సహించేందుకే బోనస్

- ప్రతిరైతు సన్న రకం ధాన్యం పండిస్తే రీసైక్లింగ్ దందా ఉండదు
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- నాడు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేసింది దొంగ దీక్ష అని విమర్శ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్రంలోని పేదలు, అంగన్‌వాడీలు, వసతిగృహాలు, పాఠశాలల విద్యార్థులకు సన్నబియ్యం అందించాలనే లక్ష్యంతో సన్న ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు బోనస్ ఇస్తున్నామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి కలెక్టరేట్‌లో సమీక్ష అనంతరం విలేకరులతో మాట్లాడారు. సన్న ధాన్యం సాగును ప్రోత్సహించడం ద్వారా దళారుల రీసైక్లింగ్ దందా సైతం లేకుండా పోతుందన్నారు. మహబూబ్‌నగర్‌లో రైతుపండుగకు రైతులందరినీ ఆహ్వానిస్తున్నామన్నారు. ఇక పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ విషయంలో, పేదలకు ఇళ్లు కట్టించే విషయంలో ఏవిధంగా పనిచేసిందో అందరికీ తెలిసిందేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే కొత్త పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసే లక్ష్యంతో వెళుతున్నామన్నారు.

కానిస్టేబుల్ కిష్టయ్య, శ్రీకాంతాచారి లాంటి అనేకమంది తెలంగాణ కోసం ప్రాణత్యాగాలు చేశారని కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఇంతమంది త్యాగాలతో తెలంగాణ వచ్చిందన్నారు. తెలంగాణ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో దీక్షా దివస్ ఎవరు చేసుకోవాలని పరోక్షంగా బీఆర్‌ఎస్ గురించి విమర్శలు చేశారు. సోనియా గాంధీ పుట్టిన రోజున అసలైన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంతకు ముందు ధర్పల్లిలో జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. కేసీఆర్ ఖమ్మం ఆస్పత్రిలో చేసింది దొంగ దీక్ష అన్నారు. ఆస్పత్రిలో జ్యూస్ తాగి దీక్ష అంటే ఎలా అన్నారు. ఆస్పత్రిలో దీక్ష చేస్తే డాక్టర్లు చావనిస్తారా అన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు మాత్రం కేసీఆర్ చావు నోట్లో తల పెట్టి తెలంగాణ తెచ్చారని చెబుతున్నారన్నారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని, లేకుంటే తల నరుక్కుంటానని చెప్పి అధికారంలోకి వచ్చాక మాటమార్చారని విమర్శించారు. తాను మాత్రం తెలంగాణ వచ్చాకే మంత్రి పదవి తీసుకుంటానని చెప్పి ఉమ్మడి రాష్ట్రంలో మంత్రి పదవికి రాజీనామా చేశానన్నారు.

రీజినల్ రింగ్‌రోడ్ తెలంగాణకు సూపర్ గేమ్ చేంజర్

హైదరాబాద్ చుట్టూ నిర్మించనున్న రీజినల్ రింగ్‌రోడ్ తెలంగాణకు సూపర్ గేమ్ చేంజర్ కానుందని కోమటిరెడ్డి అన్నారు. ఈ రోడ్డుకు ఫిబ్రవరిలో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. సంగారెడ్డి– భువనగిరి– చౌటుప్పల్ వరకు మొదటి దశ రోడ్డు ఉంటుందన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిర్మించిన ఔటర్ రింగ్‌రోడ్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మెట్రో రైలు, కోకాపేట సెజ్, పీవీ ఫ్లైఓవర్లతో నగరం అభివృద్ధి చెందిందన్నారు. అది గేమ్‌చేంజర్ అయ్యిందన్నారు. ఇక రీజినల్ రింగ్‌రోడ్‌తో తెలంగాణకు సూపర్ గేమ్‌చేంజర్ కానుందన్నారు. ఇక రియల్ ఎస్టేట్ పడిపోయిందని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. ఎన్నికల సమయంలో కొంతమేరకు రియల్ ఎస్టేట్ స్లో కావడం సాధారణమన్నారు.

న్యూస్‌రీల్

'గ్రంథాలయ సెస్ వసూలు చేయాలి'



కామారెడ్డి అర్బన్: జిల్లాలో మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు బకాయిపడ్డ గ్రంథాలయ సెస్ రూ. 2.10 కోట్లను వసూలు చేయడానికి కార్యాచరణ రూపొందించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2024–25 సంవత్సరం బడ్జెట్ ఆమోదం, అభివృద్ధి కార్యక్రమాలు, సెస్ వసూళ్లు, సిబ్బంది ఖాళీలపై చర్చించారు. జిల్లాలోని మూడు బల్దియాల నుంచి రూ.30 లక్షలు, గ్రామపంచాయతీలనుంచి రూ. 1.80 కోట్ల సెస్ రావాల్సి ఉందని సంస్థ కార్యదర్శి వంశీకృష్ణ తెలిపారు. గ్రామపంచాయతీలు సెస్ బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకుంటానని డీపీవో శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. ఖాళీల భర్తీ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చైర్మన్ తెలిపారు. సమావేశంలో డీపీవో శ్రీనివాస్‌రావును సన్మానించారు. ఎంఈవో ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

4, 11, 18 తేదీల్లో సదరం క్యాంపులు

కామారెడ్డి క్రైం: జిల్లాలోని దివ్యాంగుల కోసం వచ్చేనెల 4, 11, 18 తేదీల్లో సదరం క్యాంపులను నిర్వహించనున్నట్లు డీఆర్‌డీవో సురేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెన్యువల్ కోసం 270 స్లాట్‌లు, కొత్త వారికి 1,032 స్లాట్‌లు ఉన్నాయని పేర్కొన్నారు. మీసేవ కేంద్రాల ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు.

సీఎం సభకు వంద మంది రైతులు

కామారెడ్డి అర్బన్: మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో శనివారం నిర్వహించే రైతు పండుగ సభకు జిల్లా నుంచి వంద మంది రైతులను తీసుకువెళ్లనున్నామని డీఏవో తిరుమల ప్రసాద్ తెలిపారు. వీరికోసం రెండు బస్సులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అలాగే జిల్లాలోని 25 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి సందేశం ప్రసారం చేయనున్నట్లు తెలిపారు.

'అడవికి నిప్పుతో పర్యావరణానికి ముప్పు'



కామారెడ్డి అర్బన్: అడవులకు నిప్పు పెడితే పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని రాజన్న సిరిసిల్ల జోన్ ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ శ్రవణన్ పేర్కొన్నారు. అడవులకు నిప్పు పెట్టకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో 'అడవికి నిప్పు –నివారణ చర్యలు' అంశంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అడవిలో నిప్పు కనిపించగానే క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తమై స్థానికుల సహకారంతో ఆర్పివేయించాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది విధులు, బాధ్యతలను జిల్లా అటవీ అధికారి నిఖిత, డివిజనల్ అటవీ అధికారి రామకృష్ణ వివరించారు. అటవీ టోల్‌ఫ్రీ నంబర్ 1926 లేదా 1800 425 5364, ఫైర్ అలర్ట్ వాట్సాప్ నంబర్ 98033 38666 లపై ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో అటవీ రేంజ్ అధికారులు రమేష్, హబీబ్, దివ్య, చరణ్, ఓంకార్, హేమచందన, వాసుదేవ్, సంతోష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలు ప్రారంభం



కామారెడ్డి క్రైం: జిల్లాలో రాష్ట్రస్థాయి యోగా పోటీలు నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని యోగా భవన్‌లో శుక్రవారం రాత్రి 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి యోగాసన చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించారు. అండర్–14 బాలబాలికలకు యోగా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలన్నారు. రెండు రోజులపాటు పోటీలు జరగనున్నాయి. కార్యక్రమంలో డీఈవో, ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజు, రాష్ట్ర స్థాయి పరిశీలకులు సతీష్, పుష్పలీల తదితరులు పాల్గొన్నారు.

అందని పరిహారం



సోమేశ్వర్ వద్ద కొనసాగుతున్న 765–డి రోడ్డు పనులు

- జాతీయ రహదారి 765–డి పనులతో భూములు కోల్పోయిన పలువురు
- పరిహారం కోసం బాధితుల ఎదురుచూపులు



అంకోల్ క్యాంపు వద్ద..

బాన్సువాడ: జాతీయ రహదారి పనులతో భూములు కోల్పోయిన వారికి ఇంకా పరిహారం అందలేదు. జిల్లాలోని నాగిరెడ్డిపేట మండలం పోచారం నుంచి ఎల్లారెడ్డి మీదుగా నిజామాబాద్ జిల్లా రుద్రూర్ వరకు 765–డి జాతీయ రహదారి నిర్మిస్తున్నారు. ఈ రోడ్డును 150 ఫీట్ల వెడల్పుతో వేస్తుండడంతో రహదారి పక్కన భూములు పోతున్నాయి. దీనికోసం గతంలోనే భూ సేకరణ జరపగా ప్రస్తుతం పలు గ్రామాల్లో రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. పోచారం నుంచి రుద్రూర్ వరకు 51.66 కిలోమీటర్ల మేర రోడ్డు వేస్తుండడంతో జిల్లాలోని ఎల్లారెడ్డి డివిజన్‌లో 16.1118 ఎకరాలు, బాన్సువాడ డివిజన్‌లో 38.2400 ఎకరాల భూమిని సేకరించారు. మలుపులు లేకుండా భవిష్యత్‌లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్డు నిర్మిస్తున్నారు. దీంతో వ్యవసాయ భూములు, విలువైన స్థలాలను, ఇళ్లు కోల్పోవాల్సి వస్తోంది. అయితే భూ సేకరణలో భాగంగా ప్రభుత్వం ఇచ్చే పరిహారం మార్కెట్ విలువతో పోలిస్తే చాలా తక్కువగా ఉండడంతో నిర్వాసితులు నష్టపోయే అవకాశం ఉంది. వ్యవసాయ భూముల్లోంచి రోడ్డు పోతే అటూ, ఇటూ రాకపోకలకు రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయి. ఇచ్చే పరిహారం తక్కువ కాగా అది కూడా ఇంకా రాకపోవడంతో భూములు కోల్పోతున్న వారు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపాం

ఎల్లారెడ్డి–రుద్రూర్ రోడ్డు నిర్మాణానికి 150 ఫీట్లతో భూసేకరణ జరిగింది. పనులు కూడా చేపడుతున్నాం. నస్రుల్లాబాద్ మండలం కంశెట్టిపల్లి గ్రామానికి సంబంధించిన భూ నిర్వాసితుల వివరాలతో ప్రభుత్వానికి నివేదిక పంపాం. త్వరలో పరిహారం విడుదల అవుతుంది. మూడు నెలల్లో మిగతా గ్రామాల్లో సేకరించిన భూములకు పరిహారం కూడా అందుతుంది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపాం. ముందుగా సమస్యలు లేని చోట పనులు చేపడుతున్నాం. పట్టణాల్లో 50 ఫీట్ల వరకు పరిహారం అందదు. 50 ఫీట్లు దాటి భవనాలు పోతే పరిహారం మంజూరు అవుతుంది.

– ప్రవీణ్‌రెడ్డి, డీఈఈ నేషనల్ హైవే, బాన్సువాడ

జాతీయ రహదారి కోసం సేకరించిన భూమి వివరాలు

గ్రామం	సేకరించిన భూమి(ఎకరాల్లో..)				
పోచారం	2.2843	సఫ్దాల్‌పూర్	0. 2250	నర్వ	2.0700
మాల్తుమ్మెద	0.0350	ఎల్లారెడ్డి	0.0475	మగ్దుంపూర్	1.2500
నాగిరెడ్డిపేట	0.0300	లింగారెడ్డిపేట	1.1200	తిర్మలాపూర్	7.000
జాన్కంపల్లి	1.0875	తిమ్మారెడ్డి	1.2150	తాడ్కోల్	0.2200
రాఘవపల్లి	0.0200	మట్టడ్‌పల్లి	1.1875	బాన్సువాడ	0.1300
కన్నారెడ్డి	1.3225	అన్నసాగర్	2.3400	సోమేశ్వర్	1.100
మాచాపూర్	2.1975	గున్కుల్	4.1700	దుర్కి	5.0400
		తున్కిపల్లి	0.2700	కంశెట్టిపల్లి	0.1100
		బూర్గుల్	10.1800	నస్రుల్లాబాద్	4.3900

ఉద్యమాల గడ్డ కామారెడ్డి

- కేసులకు భయపడొద్దు.. కార్యకర్తలకు అండగా ఉంటాం
- బీఆర్‌ఎస్ దీక్షా దివస్‌లో ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి ఉద్యమాల గడ్డ అని, రాష్ట్ర సాధనోద్యమంలో కేసీఆర్‌కు వెన్నుదన్నుగా నిలిచిన ప్రాంతమని బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన నవంబర్ 29వ తేదీన బీఆర్‌ఎస్ ఏటా దీక్షా దివస్‌గా నిర్వహిస్తోంది. శుక్రవారం దీక్షా దివస్‌ను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం, తెలంగాణ అమరవీరుడు పోలీస్ కిష్టయ్య, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు, హౌసింగ్ బోర్డు వద్దనున్న అమర వీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం సత్యగార్డెన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. పదవులను గడ్డిపోచతో సమానంగా త్యాగం చేసి, ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకువచ్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. ఆయన తొమ్మిదిన్నరేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు.

కేటీఆర్ అంటేనే కాంగ్రెస్‌కు వణుకు

కేటీఆర్ అంటేనే కాంగ్రెస్ నాయకుల్లో వణుకు పుడుతుందని ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. కేటీఆర్ గళం విప్పకుంటే ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి రూ.12 వేల కోట్లకు తెలంగాణను అదానీకి అప్పగించేవాడన్నారు. ఆయన గళం విప్పగానే అదానీ ఇచ్చిన రూ. 100 కోట్ల చెక్కును రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి ఇచ్చిందన్నారు. గురుకుల విద్యార్థుల కష్టాలపై పర్యటనలు చేస్తామని కేటీఆర్ అనగానే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ భయపడి కలెక్టర్లకు ఆదేశాలిచ్చారని, దీంతో వారు గురుకులాల బాట పట్టారని పేర్కొన్నారు. తల్లిలాంటి పార్టీకి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ద్రోహం చేశారన్నారు. ఎన్ని రకాలుగా వేధించినా బాన్సువాడలో పార్టీ మారని బీఆర్‌ఎస్ నాయకుడు జుబేర్‌ను అభినందించారు. కాంగ్రెస్ నాయకులు పెట్టిస్తున్న అక్రమ కేసులకు కార్యకర్తలు అధైర్యపడవద్దన్నారు. ఒక్కరిపై తప్పుడు కేసు పెట్టిస్తే లక్ష మంది వచ్చి కొట్లాడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, వేదికపై మాజీ ఎమ్మెల్యేలు గంప, జాజాల

గ్యారంటీలేమయ్యాయి?

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మొత్తం 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ఏ ఒక్క గ్యారంటీని సరిగా అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికే ఒక పంట రైతుబంధు ఎగ్గొట్టారన్నారు. ఒక ముఖ్యమంత్రిగా ఉండి సీఎం రేవంత్‌రెడ్డి బూతులు మాట్లాడడం సిగ్గు చేటన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. తెలంగాణకు కేంద్రం నిధులు ఎందుకు కేటాయించడం లేదో బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జెడ్పీ మాజీ చైర్మన్‌లు దఫేదార్ రాజు, శోభ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంప గోవర్ధన్

'బ్యాంక్ గ్యారంటీ సమర్పించాలి'



కామారెడ్డి క్రైం: రైస్‌మిల్లర్లు ధాన్యం కేటాయింపులకు సంబంధించి బ్యాంక్ గ్యారంటీ, అగ్రిమెంట్‌లను సమర్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రైస్ మిల్లర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈయేడాది సీఎంఆర్ కోసం ఇప్పటికే ధాన్యం కేటాయిస్తున్నందున వెంటనే గ్యారంటీలు, అగ్రిమెంట్‌లు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్‌ను వెంటనే సరఫరా చేయాలని ఆదేశించారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.విక్టర్, పౌర సరఫరాల కార్పొరేషన్ డీఎం రాజేందర్, ఇన్‌చార్జి డీఎస్‌వో నరసింహారావు, అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేపై విమర్శలు తగవు

పిట్లం(జుక్కల్): మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ప్రస్తుత ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్‌పై చౌకబారు విమర్శలు మానుకోవాలని పిట్లం మండల సీనియర్ నాయకులు అడ్వొకేట్ రాంరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే అవినీతికి పాల్పడుతున్నాడని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం లేదని హన్మంత్ షిండే మాట్లాడడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్, కృష్ణారెడ్డి, హన్మాండ్లు, మల్లికార్జున్, జొన్న మోహన్ రెడ్డి, షేక్ నజీర్, శివ, ఎరుకల అశోక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్‌లో గోదాం నిర్మిస్తాం



పిట్లం: పిట్లం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో త్వరలో 50వేల మెట్రిక్ టన్నుల గోదాం నిర్మిస్తామని, రైతుల సంక్షేమమే మార్కెట్ కమిటీ ముఖ్య ఉద్దేశమని మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మార్కెట్ కమిటీలో 11,000 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే గోదాములు ఉన్నాయని, మరో అదనంగా 50 వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. మార్కెట్ కమిటీ యార్డ్‌లో సీసీ రోడ్ల పునరుద్ధరణ చేస్తామని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తామన్నారు. గోదాముకు మరమ్మతులు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, అడ్వకేట్ రామ్‌రెడ్డి, డైరెక్టర్లు షేక్ నజీర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

రామారెడ్డి: బాల్యవివాహాలను సమూలంగా నిర్మూలిద్దామని రామారెడ్డి వైద్యాధికారి సురేశ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేశ్, వైద్య సిబ్బంది ఆశలు పాల్గొన్నారు.

అటవీ సిబ్బందికి సన్మానం



కామారెడ్డి అర్బన్: ఉద్యోగ విరమణ పొందనున్న ఇద్దరు అటవీ శాఖ సిబ్బందిని సిరిసిల్ల రాజన్న జోనల్ చీఫ్ కన్జర్వేటర్ శరవణన్ అభినందించారు. సెక్షన్ అధికారి ఎ శంకర్, బీట్ అధికారి ఎం అంజయ్యను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి నిఖిత, డివిజనల్ అటవీఅధికారి పి రామకృష్ణ, రేంజ్ అధికారి రమేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిస్సార్ అహ్మద్‌కు..



కామారెడ్డి అర్బన్: బిచ్కుంద శాఖ గ్రంథాలయంలో పార్ట్‌టైం వర్కర్‌గా పనిచేస్తు ఉద్యోగ విరమణ పొందనున్న నిస్సార్ అహ్మద్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కార్యదర్శి వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



లింగంపేటలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ నాయకులు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

సాక్షి నెట్‌వర్క్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాలో రైతు దినోత్సవ వేడుకలను పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటాలకు నాయకులు, రైతులు పాలాభిషేకం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తోందని అన్నారు. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



నస్రుల్లాబాద్‌లో పీఏసీఎస్ చైర్మన్



కామారెడ్డి సింగిల్ విండో కార్యాలయంలో..



నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌లో..



తాడ్వాయిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు



గాంధారిలో..

సాక్షి ఎఫెక్ట్..

పాఠశాలను సందర్శించిన జెడ్పీ సీఈవో



బియ్యాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో

సదాశివనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం నిర్వహణపై 'సాక్షి'లో శుక్రవారం 'రుచించని భోజనం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జడ్పీ సీఈవో చందర్ నాయక్, ఎంపీడీవో సంతోష్ కుమార్‌లు స్పందించి మండలంలోని తుక్కోజివాడి ఉన్నత పాఠశాలను సందర్శించారు. భోజనం తీరును పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

పాఠశాలలో బోరుకు మరమ్మతులు



బోరుకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డి రూరల్: మండలంలోని కళ్యాణి జెడ్పీ పాఠశాలలో జీపీ అధికారులు శుక్రవారం బోరుకు మరమ్మతులు చేపట్టారు. శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'రుచించని భోజనం' శీర్షికకు స్పందించిన అధికారులు పాఠశాలలో నీటికి ఇబ్బందులు ఉండడంతో బోరుకు మరమ్మతులు చేయించి విద్యార్థులకు నీటి ఇబ్బందులు లేకుండా చేశారు.

నందివాడలో..

తాడ్వాయి: మండలంలోని నందివాడ ఉన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారులు సందర్శించారు. పాఠశాలలో కొన్ని రోజుల నుంచి మధ్యాహ్న భోజనం అందడం లేదని శుక్రవారం 'సాక్షి' ప్రచురితమైన వార్తకు విద్యాశాఖ అధికారులు స్పందించారు. పాఠశాలకు చేరుకొని మధ్యాహ్న భోజనం వండేలా చర్యలు చేపట్టారు.

కంపోస్టు షెడ్డు పరిశీలన



కంపోస్టు షెడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో

బిచ్కుంద: మండలంలోని చిన్నదేవాడలో కంపోస్టు షెడ్డును ఎంపీడీవో గోపాల్ శుక్రవారం పరిశీలించారు. 'సాక్షి' దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన నిరుపయోగంగా కంపోస్టు షెడ్డులు అనే కథనానికి అధికారులు స్పందించారు. పైఅధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో కంపోస్టు షెడ్డును పరిశీలించారు. గ్రామంలో సేకరించిన చెత్త కంపోస్టు షెడ్డులో లేకపోవడంతో జీపీ కార్యదర్శి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను ఎందుకు వేర్వేరు చేయడం లేదని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తండ్రి బతికి ఉండగానే డెత్ సర్టిఫికెట్

బాల్కొండ: తండ్రి బతికి ఉండగానే ఓ వ్యక్తి డెత్ సర్టిఫికెట్ తీసుకున్నాడు. పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసి సర్టిఫికెట్ పొందడమే కాకుండా తండ్రి పేరు మీద ఉన్న ఇంటిని తన మీదకు మార్చుకొని లోన్ కూడా తీసుకున్నాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మెండోరా మండలం బుస్సాపూర్‌కు చెందిన ప్రసాద్‌కు కుమారుడు నాయుడు ఉన్నారు. నాయుడు పంచాయతీ కార్యదర్శి సుకన్య సంతకం ఫోర్జరీ చేసి తన తండ్రి పేరు మీద డెత్ సర్టిఫికెట్ తీసుకున్నాడు. అనంతరం తన తండ్రి పేరున ఉన్న ఇంటిని తన పేరును చేయించుకుని బ్యాంకు రుణం కూడ పొందాడు. బ్యాంకు రుణం బయటకు రావడంతో అసలు విషయం తెలిసింది.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న సెక్రెటరీ సుకన్య

ఏడాది క్రితం ఈ ఘటన జరగ్గా కార్యదర్శి సుకన్య బదిలీపై కూడా వెళ్లింది. తాజాగా సంతకం ఫోర్జరీ చేశారని తెలుసుకుని ఆమె శుక్రవారం మెండోరా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

నూతన కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి అర్బన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం దోమకొండ పాత తాలుకా యూనిట్ ఎన్నికలు జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని సంఘ భవనంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా భూపాల్ సంతోష్‌కుమార్, కార్యదర్శిగా అల్లడి రమేశ్, కోశాధికారిగా కాటిపల్లి లిఖిత్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికైన ప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో ఎం నాగరాజు, ఎం చక్రధర్, దేవరాజు, సాయిలు, శివకుమార్, జుగల్ కిశోర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మహమ్మద్‌నగర్‌లో..



నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండలం పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కుషాల్ తెలిపారు. అధ్యక్షుడిగా కలకొండ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా వెంకట్‌రాంరెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గానికి జిల్లా అధ్యక్షుడు అభినందనలు తెలిపారు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్ మండల పీఆర్టీయూ అధ్యక్షుడిగా జంగిటి సంతోష్, ప్రధాన కార్యదర్శిగా సురేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కుషాల్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో అమర్‌సింగ్, కాంప్లెక్స్ హెచ్ఎం రామచందర్, నాయకులు రమణ, భాస్కర్‌గౌడ్, నరహరి, రమేశ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి టీఎన్జీవో సంఘం అధ్యక్షుడిగా మహిపాల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన టీఎన్జీవో సంఘం ఉద్యోగుల సమావేశంలో ఎల్లారెడ్డి తాలూకా టీఎన్జీవో సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యదర్శిగా శ్రావన్, కోశాధికారిగా రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ది దొంగ దీక్ష



ధర్పల్లిలో మహిళా సమాఖ్య సంఘాలకు చెక్కు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

- సంక్రాంతికి రైతు భరోసా
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ధర్పల్లి: రాష్ట్ర సాధన ఉద్యమంలో కేసీఆర్ చేసిన దీక్ష దొంగ దీక్ష అని, దీక్షా దివస్ పేరుతో ఇప్పుడు మరో నాటకం ఆడుతున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తాను మంత్రి పదవికి రాజీనామా చేసి ఆమరణ దీక్ష చేపట్టానని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్రాన్ని సోనియా గాంధీ ప్రకటించారని కోమటిరెడ్డి అన్నారు. శుక్రవారం ధర్పల్లి మండల కేంద్రం నుంచి ఇంద్రానగర్, మారియా తండాలను కలుపుతూ ధమన్నపేట వరకు రూ.8 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. డిసెంబర్ 9న సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద స్థలం ఉన్న నిరుపేదలకు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామన్నారు. సంక్రాంతి కానుకగా యాసంగి పంటలకు రైతు భరోసా కింద రూ.7,500 చొప్పున పంపిణీ చేస్తామన్నారు. కమీషన్ల కోసమే కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రధాని మోదీకి డీజిల్, పెట్రోల్‌పై నియంత్రణ లేకపోవడంతో సామాన్యులపై భారం మోపుతున్నారని ఎద్దేవా చేశారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ రోడ్లకు రూ.250 కోట్లను రానున్న బడ్జెట్ సమావేశంలో కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ధర్పల్లి మండలం మహిళా సమాఖ్య సంఘాలకు రూ.350 కోట్ల రుణాల చెక్కును ఆయన అందజేశారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. అడిగిన వెంటనే రూరల్ నియోజకవర్గంలో రోడ్ల పనులకు నిధులు మంజూరు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మికాంతారావు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, మనోహర్ రెడ్డి, చెలిమెల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో విద్యార్థి మృతి


- అనారోగ్యం, ఆకస్మిక గుండె పోటు
- అనుమానాస్పద మృతిగా పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు



శివజశ్విత్‌రెడ్డి (ఫైల్)

నిజామాబాద్‌అర్బన్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి శివజశ్విత్‌రెడ్డి పాఠశాల హాస్టల్‌లోనే శుక్రవారం అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందాడు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు 4వ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్‌కు చెందిన శివ జశ్విత్‌రెడ్డి నగరంలోని కాకతీయ స్కూల్‌లో హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నాడు. విద్యార్థి కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్నాడు. గురువారం రాత్రి వాంతులు కావడంతో హాస్టల్ సిబ్బంది మాత్రలు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం వార్డెన్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శుక్ర వారం ఉదయం తల్లిదండ్రులు హాస్టల్‌కు వచ్చారు. శివజశ్విత్‌రెడ్డి మూడవ అంతస్తు నుంచి కిందికి వచ్చి మెట్ల వద్ద పడిపోయాడు. విద్యార్థిని తండ్రి హుటాహుటిన పక్కనే ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు విద్యార్థి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విద్యార్థి అనారోగ్యం బారిన పడడంతో పాటు ఆకస్మాత్తుగా గుండె పోటు వచ్చిందని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటన తెలియగానే పోలీసులు పాఠశాల ఆవరణలో బందోబస్తు నిర్వహించారు. విద్యార్థి నోటిలో నుంచి రక్తం వచ్చినట్లు ఉండడాన్ని తల్లిదండ్రులు గమనించారు.తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని విద్యార్థి తల్లి, తండ్రి భాస్కర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును లోతుగా దర్యాప్తు చేస్తామని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని 4వ టౌన్ ఎస్సై పేర్కొన్నారు.

కళాశాలలో లెక్చరర్..



రుద్రూర్ : కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జువాలజీ లెక్చరర్ గోవర్ధన గిరి (49) గుండెపోటుతో మృతి చెందారు. అధ్యాపకులు తెలిపిన వివరాల ప్రకారం.. కళాశాలలో విధుల్లో ఉన్న గోవర్ధనగిరి ఒక్క సారిగా కుప్పకూలిపోయారు. సహచర అధ్యాపకులు హుటాహుటిగా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. లెక్చరర్ ఆకస్మిక మరణం అధ్యాపకుల్లో, విద్యార్థుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

ప్రొటీన్ల నిర్మాణంలో క్రయో ఎలక్ట్రానిక్స్ పాత్ర కీలకం



మాట్లాడుతున్న వెంకటప్రసాద్ దాండ్లి

తెయూ (డిచ్‌పల్లి): ప్రొటీన్ల నిర్మాణ విశ్లేషణలో క్రయో ఎలక్ట్రానిక్ మైక్రోస్కోపి పాత్ర ఎంతో కీలకమని అమెరికా నార్త్ కరోలిన్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ సైన్సెస్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటప్రసాద్ దాండ్లి పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'ప్రొటీన్ల నిర్మాణ విశ్లేషణలో క్రయో ఎలక్ట్రాన్ మైక్రో స్కోపి పాత్ర' అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. ప్రొటీన్ల ఛాయాచిత్రాలను తెలుసుకోవడంతో వ్యాధి నిరోధక శక్తిని పెంచే అనేక రకాలైన డ్రగ్స్‌ను సులభంగా తయారు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బయోటెక్నాలజీ హెచ్‌వోడీ ప్రసన్నశీల, కళాశాల ప్రిన్సిపాల్ ఆరతి, వైస్ ప్రిన్సిపాల్ మామూరపు సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు ప్రవీణ్ మామిడాల, మహేందర్ రెడ్డి, కిరణ్మయి, వాసం చంద్రశేఖర్, బోయపాటి శిరీష పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జూమ్ లింక్ ద్వారా తెయూ అనుబంధ కళాశాలల విద్యార్థులు వీక్షించారు.

క్రైం కార్నర్

మూడు స్కూల్ బస్సుల సీజ్



నందిపేట్(ఆర్మూర్): మండలంలో అనుమతులు లేకుండా, ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న స్కూల్ బస్సులపై ఆర్మూర్ ఆర్టీఏ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో టాక్స్ లేకుండా తిరుగుతున్న మూడు పాఠశాలలకు చెందిన బస్సులను ఆర్మూర్ ఎంవీఐ వివేకానందరెడ్డి చేసి సీజ్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల, కళాశాలకు ఫిట్‌నెస్ బస్సులను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్ కేసులో కోర్టు ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ శుక్రవారం తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 12 మందికి ట్రాఫిక్ సీఐ ప్రసాద్ కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ అహ్మద్ మొయిద్దీన్ తొమ్మిది మందికి రూ.25,500 జరిమానా విధించినట్లు చెప్పారు. ఎల్లమ్మ గుట్టకు చెందిన దిడి రాజుకు రెండు రోజులు, దారుగల్లీకి చెందిన హుస్సేన్ బిన్ సలీంకు మూడు రోజుల జైలు శిక్ష విధించారు.

స్తంభాన్ని ఢీకొన్న లారీ



బాల్కొండ: ముప్కాల్ మండలం వెంచిర్యాల్ శివారులో శెట్‌పల్లి వెళ్లే రోడ్డు పక్కన గల విద్యుత్ స్తంభాన్ని శుక్రవారం ఉదయం ఎరువుల లారీ ఢీకొంది. డ్రైవర్ అతి వేగంగా, అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదం జరిగిందని రైతులు తెలిపారు. లారీ యజమాని చేతనే స్తంభాన్ని పునరుద్ధరించినట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

కనుల పండువగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రథంపై ఉత్సవ మూర్తులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని నవనాథ సిద్ధేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రథోత్సవం(గిరి ప్రదక్షిణ) ఘనంగా నిర్వహించారు. నవనాథ సిద్ధేశ్వర, అన్నపూర్ణ సీతారామ, అయ్యప్ప విగ్రహాలను రథంపై ఉంచి ఉరేగింపు నిర్వహించారు. ప్రతి సంవత్సరం కార్తీక త్రయోదశి రోజు స్వామివారి విగ్రహాలతో ఉరేగింపు నిర్వహిస్తారు. సిద్ధుల గుట్ట నందీశ్వర మహరాజ్ పూజలు చేసిన అనంతరం ఉరేగింపు ప్రారంభించారు. కాంగ్రెస్ ఆర్మూర్ నియెజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. కాలనీల్లో మహిళలు పెద్దఎత్తున స్వామి వారికి మంగళ హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి సుమన్, పీసీ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

